క్లుప్తంగా

నేడు పెద్దగురువళూరులో ఆరోగ్య సురక్ష

చాపాడు: మండల పరిధిలోని పెద్దగురువళూరు గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలకు అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

అన్నమయ్యకు ఘన నివాళి



అన్నమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవాకేంద్రంలో శుక్రవారం పదకవితా పితామహుడు అన్నమయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలుగు సంగీతానికి, సాహిత్యానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. అన్నమయ్య సంకీర్తనల గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో హరికథా భాగవతార్ యడవల్లి రమణయ్య భాగవతార్, డాక్టర్ హరి, ఆర్‌సీపీఈ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకుడు పంజగల మధుసూధన్‌బాబు, ఓబుల్ రెడ్డి, రాష్ట్రభాషోపాధ్యాయసంస్థ ఉపాధ్యక్షుడు సాయికుమార్, గంగాధర్, వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే.. విజయం మీ వెంటే



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు

ప్రొద్దుటూరు: నైపుణ్యం ఉంటే.. విజయం మీ వెంటే ఉంటుందని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మూడో సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వివిధ క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థులు విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని లండన్ కిడ్స్ కాన్సెప్ట్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పల లక్ష్మీశ్రావణి అన్నారు. స్థానిక సాయిరాజేశ్వరి కాలనీలోని లండన్ కిడ్స్ కాన్సెప్ట్ ప్రీ స్కూల్ పదో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ, లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 5 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

ఆరాధన ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో అవధూత నారాయణరెడ్డి స్వామి

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంసాగర్ సమీపంలోని అవధూత నారాయణరెడ్డి స్వామి 110వ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా నిర్వాకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం చేశారు.

వలంటీర్లంటే చంద్రబాబుకు వెన్నులో వణుకు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: వలంటీర్ల వ్యవస్థ అంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవాచేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్లు అందుకునే వృద్ధులు, దివ్యాంగులు చంద్రబాబు నిర్వాకంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వలన వలంటీర్లు డబ్బు పంచరాదని ఈసీ ఆదేశించిందన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వృద్ధులు, నడవలేని వారు మండుటెండలో సచివాలయాల వద్దకు వెళ్లలేక అగచాట్లు పడుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వారిని చూస్తుంటే హృదయం కలిచివేస్తుందని, చంద్రబాబు, వరదరాజులరెడ్డికి జాలి, కరుణ లేదని విమర్శించారు. వలంటీర్లు చెబితే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తారని చంద్రబాబు వారిపై శత్రుత్వాన్ని పెంచుకున్నారని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థ ఎంత శక్తివంతమైనదో ఇప్పటికే చంద్రబాబు, వారి పార్టీ నాయకులకు అర్థమైందన్నారు. 2024లో అధికారంలోకి రాగానే తొలి సంతకం వలంటీర్ వ్యవస్థపైనే పెడుతానని సీఎం వైఎస్ జగన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే చాలా మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని, ప్రభుత్వం ఏర్పాటు కాగానే వారందరిని కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు.

ఆదరించండి

మా వల్ల మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే మమ్మల్ని ఆదరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని ముక్తియార్ ఆయిల్‌మిల్లు సమీపంలోని ప్రజలతో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వరదరాజులరెడ్డి మాత్రం ఎన్నికలకు ముందు రోజు అర్ధరాత్రి దొంగ పట్టాలు పంపిణీ చేసి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఆయన వర్గీయులు, టీడీపీ నాయకులు అనేక మార్లు ఈ ప్రాంత వాసులను ఇబ్బంది పెడుతూ వచ్చారని తెలిపారు. ఇక్కడి ప్రజలకు ఏం మేలు చేశారని వరదరాజులరెడ్డి ఓట్లు అడగటానికి వస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆయన ఎప్పుడూ మిమ్మల్ని ఓటర్లుగా చూశారని, తాము అలా చూడలేదని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి జగన్‌కు మళ్లీ పట్టం కట్టండి

ప్రొద్దుటూరు: కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ప్రజలు పట్టం కట్టాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మండలంలోని గోపవరం పంచాయతీ భగత్‌సింగ్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో శుక్రవారం ఎమ్మెల్యే, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపవరం పంచాయతీలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆయన మళ్లీ సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. టీడీపీ నాయకుల మాయమాటలకు ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, సర్పంచ్ గద్ద మోష, మాజీ సర్పంచ్ దేవీప్రాద్‌రెడ్డి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొండయ్య, వార్డు మెంబర్లు మధు, సిద్దయ్య, వెంకట్, ఆదిరెడ్డి, ఎంపీడీసీలు బూసం రవి, మహేష్, దస్తగిరిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వేమారెడ్డి, గంజికుంట శివారెడ్డి, వెంకటరాముడు, మాజీ వార్డు మెంబర్ మేరి, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా శ్రీరాములు, కమల్ పాల్గొన్నారు.

రాచమల్లు విజయానికి కృషి చేస్తాం

రాజుపాలెం: గాదెగూడూరు సర్పంచ్ పోలా వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి విజయానికి కృషి చేస్తాం అ గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు ప్రకటించారు. శుక్రవారం 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను సచివాలయ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రత్యూషకు ఇచ్చారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తమను పేదలకు సేవ చేసేందుకే జగనన్న ప్రభుత్వం నియమించిందని, కొంత మంది దుర్మార్గులు తమ సేవలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్ర

మైదుకూరు: వేసవి ముగిసే వరకు నీటిని పొదుపుగా వాడుకుందామని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావం వలన భూగర్భజలాలు అడుగంటడంతో నీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడి సహకరించాలని కోరారు. మైదుకూరు ఎర్రచెరువుకు ఫిబ్రవరి 12న తెలుగుగంగ ఎస్ఆర్-2 నుంచి నీటిని వదిలామని, అయితే అన్ని చోట్ల నీటి సమస్య ఉండటంతో చింతకుంట, శెట్టివారిపల్లె, మిట్టమానుపల్లె చెరువులకు నీటిని మళ్లించారన్నారు. అందువల్ల మైదుకూరు చెరువు పూర్తి స్థాయిలో నీరు చేరుకోలేదని, దీంతో బోర్లలో నీటిమట్టం పెరగలేదని తెలిపారు. ముఖ్యంగా సాయినాథపురం ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. తన ఇంటిలో ఉన్న బోరు నుంచి ప్రతి రోజు 40 ట్యాంకర్ల ద్వారా నీటి ఎద్దడి ఉన్న వార్డులకు నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఖాజీపేట మండలం ములపాకు బృహత్తర నీటి పథకం నుంచి నీరు అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, రెండు రోజుల్లో మైదుకూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ములపాకు నీరు వస్తే నీటి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు.

10న భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం

ఈనెల 10న తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని చంద్ర ప్రకటించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే తనను కోరితే తప్పకుండా చేస్తానని స్పష్టం చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న సందాని బాషా

ప్రొద్దుటూరు: స్థానిక రాజీవ్ సర్కిల్ సమీపంలో శుక్రవారం రంజాన్ బాబా టింబర్ డిపో ప్రొప్రైటర్ షేక్ సందాని బాషా దివ్యాంగులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రూ.1,100 విలువైన నిత్యావసర సరుకుల కిట్టను అందించినట్లు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ సలహాదారుడు చలపతిరావు, కార్యదర్శి రషీద్, యదార్థుడు, కరీముల్లా, ఖాదర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో హైటెక్ గైబుసా జాపకార్థం ఆయన కుమారుడు హైటెక్ ఫయాజ్ రంజాన్ మాసం సందర్భంగా దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మహ్మద్ బాషా, చెన్నకేశవరెడ్డి, వెంటకసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు పాల్గొన్నారు.

అన్నదానం

పట్టణంలోని యాచకులకు, వృద్ధులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. నూతల కిశోర్ కుమార్, నూకల చైతన్య సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్ తెలిపారు.

బండలాగుడు పోటీలు



కోడిగుడ్లపాడులో బండలాగుతున్న ఎద్దులు

కాశినాయన: మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామంలో శుక్రవారం శ్రీలక్ష్మీదేవి నారాయణస్వామి శిఖర కలశ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రతిష్ఠ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయ కర్త ఎస్.విశ్వనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.50 వేలు ప్రకాశం జిల్లా బొడుచెర్ల గ్రామానికి చెందిన నక్షత్రరెడ్డి ఎద్దులు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు బాపట్ల జిల్లా బలికొరువ గ్రామానికి చెందిన వీరాస్వామి ఎద్దులు, నాల్గవ బహుమతి రూ.20 వేల నంద్యాల జిల్లా మూడురాళ్లపల్లెకు చెందిన చిన్నఓబుల్‌రెడ్డి ఎద్దులు, ఐదవ బహుమతి రూ.10 వేలు కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దులు, ఆరవ బహుమతి రూ.5 వేలు కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన వెంకట సాయిప్రతాప్‌రెడ్డి ఎద్లకు గ్రామస్థులు బహుమతులను అందజేశారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి టి.సండ్రపల్లె పంచాయతీలోని బుచ్చనపల్లె, రామిరెడ్డిపాలెం, పోలిరెడ్డిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అక్కాచెల్లెమ్మలకు డ్వాక్రా రుణాల మాఫీ, సున్నావడ్డీ, చేయూత, అమ్మఒడి పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. మరోసారి మోసపూరిత వాగ్దానాలతో ప్రజల వద్దకు వస్తారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇంటికి చేరాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీనాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, బద్వేలు మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ముంతాజ్, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, శివారెడ్డి, రవికుమార్‌రెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

నేడు రాచాయపేటలో ఇంటింటి ప్రచారం

మండలంలోని రాచాయపేటలో శనివారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

బద్వేలు అర్బన్: మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ నేటితరానికి ఆదర్శప్రాయుడు అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తొలి దళిత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్ రామిరెడ్డి, కేశవరెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు సుబ్బారావు, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు శీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్వర్‌రావు, చెంచయ్య, ముంతాజ్, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రిరాజాయాదవ్ పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి

పోరుమామిళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేండ్ల పాలనలో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని, మౌళిక వసతులు సమకూరాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అక్కలరెడ్డిపల్లెలో ప్రజాదీవన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నవరత్నాలుతో జగనన్న నవశకానికి నాందీ పలికారని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి మేలు చేసిందని, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితే పేదవారికి మరింత మేలు జరుగుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, జేసీఎస్ కన్వీనర్ కె. రమణారెడ్డి, ఎంపీటీసీ రవి, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు రాళ్లపల్లె నరసింహులు, రామచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయరాములు, రవిచంద్రారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గంగనపల్లె రమణారెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆచారి మృతి

ప్రొద్దుటూరు కల్చరల్: కొట్టి చిన్న వెంకటసుబ్బయ్య ఎయిడెడ్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.సుబ్రహ్మణ్యం ఆచారి (84) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1998లో ప్రధానోపాధ్యాయుడుగా పదవీ విరమణ పొందారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వీహెచ్‌పీ అధ్యక్షుడిగా, జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడిగా, సాహిత్య కళాభారతి సంస్థ అధ్యక్షుడిగా పని చేశారు. ఆచారి మృతి పట్ల జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యే ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన జనం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, నాగిరెడ్డి

చాపాడు: మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల ప్రచారం మొదలుపెట్టింది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీ రమణారెడ్డి, ఎస్సార్ బాలనరసింహారెడ్డి ఆధ్వర్యంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓసీ, బీసీ కాలనీలు, దళితవాడలో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు.

ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారంలో భాగంగా చియ్యపాడులో పర్యటించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ పెద్ద బాణాసంచ కాల్చారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

చియ్యపాడులో దళితవాడలో స్వాతంత్ర్య సమర యోధులు, తొలి దళిత ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రాష్ట్ర ప్రభుత్వ సలహదారుడు తిరుపాల్‌రెడ్డి, హార్టికల్చర్ సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, ఎంపీపీలు లక్షుమయ్య, జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీలు రామగోవిందరెడ్డి, శాంతురాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నక్కలదిన్నె సిద్దారెడ్డి, సర్పంచ్ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, మహేష్‌యాదవ్, నారాయణరెడ్డి, మల్లికార్జనరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కిషోర్ కుమార్‌రెడ్డి, ఉదయ్, సీవీ సుబ్బారెడ్డి, జయసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గుంగులయ్య, జే.రవికుమార్, శివప్రసాద్, మనోహర్, కర్ణమాదిగ, బండి పుల్లయ్య, రమణయ్య పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మైదుకూరు: మైదుకూరులోని షాహి (పెద్ద మసీదు) మసీదులో శుక్రవారం సాయత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ గౌస్ లాజం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉద్యానశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిదేల లక్షుమయ్య, వీరనారాయణరెడ్డి, ఇర్షాద్, షౌకత్, నాయబ్ రసూల్, గౌస్ లాజం, గోశెట్టి రామచంద్ర, వీరభద్రుడు, మామిళ్లపల్లె దస్తగిరి, గోబీ బాషా పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరిన ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషాను ఆయనను అభినందించారు.

నేడు ఇడమడకలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

దువ్వూరు: మండలంలోని ఇడమడక గ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి శనివారం సాయంత్రం 4 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న ఆదిత్యరెడి, నాయకులు

కాశినాయన: పార్టీలకు అతీతంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నాయునిపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి, పేరారెడి పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినీలు జేఎన్‌టీయూఏ విడుదల చేసిన ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చూపారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ శుక్రవారం తెలిపారు. సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్)లో శివమణి 9.4, హర్షిత 9.2, చాందినీ 8.8, ఈఈఈలో సుకన్య 9.3, సీఎస్ఈలో వెంకటకీర్తి 9.1, స్నేహ 9, తస్లీమ్ 9, శైలజ 8.9, వెంకట సుమపూజిత 8.9, ఈసీఈలో శ్రావణి 9, శ్రావ్య 8.9, ఝాన్సీ లక్ష్మి 8.8 జీపీఏ సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు. వీరితో పాటు 50 మంది విద్యార్థినీలు 8 జీపీఏ సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కాలేజీ కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూష, డిప్లొమ ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, వివిధ విభాగాధిపతులు బాలసుబ్బన్న, మహ్మద్ జబీర్, యాకూబ్ అలీ, విజయమ్మ అభినందించారు.

అణగారిన వర్గాలకు గొంతుక 'జగ్జీవన్‌రామ్'



బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు: బాబూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాలకు గొంతుకగా మారడంతో పాటు అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్షుమయ్య మాదిగ పేర్కొన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. దేశానికి బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చాపాటి మనోహర్ మాదిగ, ఉపాధ్యక్షులు చాపాటి బాల నరసింహులు, దప్పు, చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని దళిత ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం మాజీ ఉపప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పీఎస్‌వైఎఫ్ కన్వీనర్ ఓబులేసు, నాయకులు శేఖర్, రమణ, పుల్లయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం: మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం బి.మఠంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గ్రామ సచివాలయ కన్వీనర్ జోగయ్య, స్థానిక నాయకుడు మణ్యం శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ కన్వీనర్ అలీవర్, సోమిరెడ్డిపల్లె నారాయణ, శివరాం పాల్గొన్నారు.